క్లుప్తంగా

డాక్టర్ చంద్రశేఖర్‌కు అవార్డు


డాక్టర్ పి.చంద్రశేఖర్

కర్నూలు (హాస్పిటల్): లయన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (కోల్‌కతా) వారు కర్నూలుకు చెందిన కార్డియాలజిస్టు, డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్‌కు చాంపియన్స్ ఆఫ్ చేంజ్ అవార్డు అందజేశారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతా నగరంలో ఉన్న ఐటీసీ రాయల్ బెంగాల్‌లో ఆదివారం సాయంత్రం ఆయనకు అవార్డును లయన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు ప్రదానం చేశారు. వైద్య రంగంలో ఆయన అందించిన సేవలకు గాను తనకు ఈ అవార్డు ప్రదానం చేశారని డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

కళాకారులు సన్మానం


కళాకారుడు తిరుపాలును సన్మానిస్తున్న కళాకారులు

కర్నూలు(సెంట్రల్): కళాకారులు కారణజన్ములుగా మిగిలిపోతారని కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ జీఎస్ఎం సుభాన్, లలిత కళా సమితి జామీ అధ్యక్షుడు పి.దస్తగిరి, కర్నూలు కళాకారుల సేవా కేంద్రం అధ్యక్షుడు బైలుప్పల షఫీయుల్లా పేర్కొన్నారు. ఆదివారం మద్దూరు నగర్‌లోని తెలుగు తోటలో కళాప్రియ తిరుపాలు 87వ జన్మదిన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను కళాకారులు సన్మానించి అభినందించారు. ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. 40 సంవత్సరాలుగా తిరుపాలు శ్రీకృష్ణ, బిల్వ మంగళ, భవాని శంకరం, అర్జున, నారద, పాత్రలను పోషించి కందుకూరి పురస్కార అవార్డును పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. జీవితంలో ఆయన మరెన్నో బహుమతులను పొందాలని కోరుకుంటున్నట్లు వారు ప్రకటించారు.

డీఎస్సీ హాల్‌టికెట్ల కోసం ఇబ్బందులు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరితో డీఎస్సీ హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ కాక అభ్యర్థులు తీవ్ర మానసిక ఆందోళనలో ఉన్నారని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మే 30వ తేదీ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించినా సాంకేతిక కారణాలతో ఇబ్బందులు తలెత్తడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని వివరించారు. ప్రభుత్వం అభ్యర్థుల వినతులను పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు జూన్ 6 నుంచి ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం కానుండడంతో త్వరగా హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగ్గురిపై బైండోవర్ కేసు

వెల్దుర్తి: రెండ్రోజుల క్రితం స్థానిక పాతబస్టాండులో మద్యం మత్తులో హల్‌చల్ సృష్టించి, తోటి కార్యకర్తపై దాడికి పూనుకుని, ఓ పత్రికా విలేకరి ఇంటిపై దాడికి యత్నించిన ముగ్గురు టీడీపీ కార్యకర్తలపై బైండోవర్ కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ ఆదివారం తెలిపారు. పట్టణానికి చెందిన కుమ్మరి రాజు, బోయ మహేశ్, అభిషేక్ గౌడ్ అడ్డువచ్చిన వారిపై జులుం ప్రదర్శిస్తూ టీడీపీ నాయకుల పేర్లతో బెదిరింపులకు దిగి, తమ ఇంటిపై దాడికి యత్నించడంపై బాధిత విలేకరి భార్య, తోటి విలేకరులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ విచారణ చేసి, సీసీ ఫుటేజీలు పరిశీలించారు. టీడీపీ నాయకులు సైతం ఆ ముగ్గురి చర్యలను ఖండించగా, భవిష్యత్‌లో ఇలాంటి చర్యలకు పాల్పడకుండా బైండోవర్ కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు

సి.బెళగల్: మండల కేంద్రంలో సోమవారం క్షయ వ్యాధి (టీబీ) నిర్ధారణ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామని డివిజన్ టీబీ సూపర్‌వైజర్ నాగమహేంద్ర అన్నారు. టీబీ నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో టీబీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 60 ఏళ్లపైబడిన వారు, బీపీ, షుగర్, ఆయాసం, దగ్గు లక్షణాలు ఉన్న వారికి గళ్ల పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆరు నెలలపాటు ఉచితంగా మందులు, పోషకాహారం కోసం ప్రతి నెలా రూ.1000 చొప్పున చెల్లిస్తామన్నారు. మండలంలోని సి.బెళగల్‌లో సోమవారం, బుధవారం గొల్లలదొడ్డి, శుక్రవారం కంబదహాల్ గ్రామాల్లో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా అఘోరయ్య స్వామి తిరునాల

వెల్దుర్తి: మండలంలోని మల్లెపల్లె గ్రామంలో అఘోరయ్య స్వామి తిరనాల ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం గరుత్మంతుడి విగ్రహం, శ్రీమహావిష్ణువు చిత్రపటాలతో ప్రభోత్సవం చేపట్టారు. సోమవారం వసంతోత్సవం, పారువేట నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ధాన్యం నిల్వ పద్ధతులపై అవగాహన

- తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే 10–12 శాతం నష్టం
- ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ సుజాతమ్మ సూచనలు


మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ

కర్నూలు(అగ్రికల్చర్): పంట కోతల అనంతరం ధాన్యం నిల్వ చేయడంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే నాణ్యతగా ఉంటాయని కర్నూలు ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.సుజాతమ్మ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో దేశీ డిప్లొమా కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు పంటల కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ మాట్లాడుతూ.. ధాన్యం గోదాముల్లో నిల్వ చేసుకునే సమయంలో తేమ 10–12 శాతం వరకు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తేమ శాతం ఎక్కువగా ఉంటే మగ్గి రంగు మారే ప్రమాదం ఉందని వివరించారు. ధాన్యం గోదాముల్లో నిల్వ చేసేటప్పుడు పాత ధాన్యం ఉంటే అందులో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధాన్యం సంచులు నేలకు, గోడలకు తాకకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ధాన్యం గోదాముల్లో నిల్వ చేసేటప్పుడు ఒక టన్నుకు 2 అల్యూమినియం పాస్పేట్ టాబ్లెట్లు ఉంచి గాలి తగలకుండా మూసి వేయాలని సూచించారు. గోదాములో మలాథిన్ పిచికారీ చేయాలన్నారు. ధాన్యం నిల్వలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల 10–12 శాతం నష్టం జరుగుతుందని, ఈ నష్టాన్ని నివారించాలంటే జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. దేశీ డిప్లొమా కోర్సు సమన్వయకర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర మాట్లాడుతూ.. రైతులు ప్రతి అవసరానికి ఇన్‌పుట్ డీలర్లను ఆశ్రయించడం జరుగుతుందని, వారికి చక్కటి సలహాలు ఇచ్చి సహకరించాలన్నారు. అన్ని విషయాలపై డీలర్లు అవగాహన పెంచుకొని రైతుల అభ్యున్నతికి దోహదపడాలని సూచించారు. వివిధ మండలాలకు చెందిన డీలర్లు పాల్గొన్నారు.

23న ఒలింపిక్స్ డే ఉత్సవాలు


మాట్లాడుతున్న ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు

కర్నూలు (టౌన్): ఈనెల 23న ఒలింపిక్ డే ఉత్సవాలను జయప్రదం చేయాలని ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక కర్నూలు క్లబ్‌లో ఆదివారం జిల్లా ఒలింపిక్ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది సంఘం ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ, ఆరోగ్యం కోసం క్రీడా సంఘాల ఆధ్వర్యంలో పరుగు, పీఈటీలకు ఆర్థిక చేయూత, విద్యార్థులకు క్రీడా పోటీలు, ఉపాధ్యాయులకు సత్కారం, ఉద్యోగాలు చేస్తున్న మహిళలకు పురస్కారాలు అందించడంలో అసోసియేషన్ ఎంతో కృషి చేసిందన్నారు. ఈ నెల 23న నిర్వహించనున్న ఒలింపిక్ డే ఉత్సవాలను క్రీడా సంఘాల ప్రతినిధులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో 2025–2026 విద్యా సంవత్సరానికి సంబంధించి అసోసియేషన్ చేపట్టాల్సిన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు, క్రీడా పోటీల గురించి చర్చించారు. క్రీడా సంఘాల ప్రతినిధులు హర్షవర్ధన్, షేక్షావలి, నాగరత్నమయ్య, దాసరి సుధీర్, ఏఎండీ, బాషా, కోలా ప్రతాప్, గుడిపల్లి సురేందర్, శ్రీనివాసులు, వేణుగోపాల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈత పోటీల్లో సత్తాచాటిన జిల్లా స్విమ్మర్లు


పతకాలు సాధించిన కర్నూలు స్విమ్మర్లు

కర్నూలు (టౌన్): పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించిన 11వ సీనియర్ అంతర్ జిల్లాల ఈత పోటీల్లో కర్నూలు జిల్లా ఈత క్రీడాకారులు సత్తా చాటారు. 50 మీటర్లు, బ్యాక్‌స్ట్రోక్‌లో ప్రతిభ, వెంకటేష్ (బంగారు), 50 మీటర్ల ఫ్రీ స్టయిల్‌లో (బంగారు), 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో (బంగారు), సౌమ్య తంజిన్ 50, 100 మీటర్ల బటర్ ఫ్లైలో (వెండి), పి.హేమలత 800 మీటర్ల ఫ్రీ స్టైయిల్ (బంగారు), హేమంత్ 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ (కాంస్యం) పతకాలు సాధించారు. పతకాలు సాధించిన స్విమ్మర్లను కోచ్ నటరాజ్ రావు, అక్వాటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహాచారి, రామకృష్ణ, కార్యదర్శి దస్తగిరి తదితరులు అభినందించారు.

రేపు ముస్లిం మహిళల ర్యాలీ

కర్నూలు(సెంట్రల్): వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ మంగళవారం సేవ్ వక్ఫ్.. సేవ్ రాజ్యాంగం ఆధ్వర్యంలో ముస్లిం మహిళలతో ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ కన్వీనర్ సయ్యద్ జాకీర్ అహ్మద్, కోకన్వీనర్ ఎంఏ హమీద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మెరిడియన్ ఫంక్షన్ హాలు నుంచి ఉదయం 9.30 గంటలకు ర్యాలీ ప్రారంభమై 12 గంటల్లోపు కలెక్టరేట్ చేరుకుంటుందన్నారు. అక్కడ నిరసన ప్రదర్శన చేపట్టిన అనంతరం కలెక్టర్‌కు మెమొరాండం ఇవ్వనున్నట్లు చెప్పారు. ర్యాలీలో పెద్ద ఎత్తున ముస్లిం మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమస్యకు నిర్దేశిత గడువులోపు పరిష్కారం లభిస్తుందని, సమస్య పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు https://meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని వివరించారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇండస్ట్రీస్ ఐకానిక్‌గా ఓర్వకల్

కర్నూలు(రూరల్): రాష్ట్రంలో పరిశ్రమలు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని.. ఓర్వకల్ ఇండస్ట్రీస్ ఐకానిక్‌గా మారబోతోందని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రిగా టీజీ భరత్ అన్నారు. ఆదివారం టీజీవీ కళాక్షేత్రంలో జిల్లా వ్యాప్తంగా పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించిన బలిజ విద్యార్థులకు జరిగిన సన్మాన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. విద్యార్థులకు నగదు పురస్కారంతో పాటు జ్ఞాపికలు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల ఆదరణతోనే తాను కర్నూలు నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యాయని తెలిపారు. కర్నూలు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు ఆర్జా రామక్రిష్ణా, అనంతయ్య, కుళ్లాయప్ప, మల్లికార్జున, కార్పొరేటర్ రమణమ్మ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పత్తికొండ రూరల్ : మండలంలోని దూదేకొండ గ్రామానికి చెందిన పి.ప్రవీణ్‌కుమార్ అనే యువకుడు ఆదివారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న ప్రవీణ్‌కుమార్‌ను గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పుల బాధతోనే పురుగుల మందు తాగినట్లు కుటుంబ సభ్యులు చెబుతుండగా ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

యోగాంధ్రకు 8.15 లక్షల మంది నమోదు

కర్నూలు(సెంట్రల్): జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు జిల్లాలో 8.15 లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి 10.68 లక్షల మంది పాల్గొనేలా లక్ష్యాన్ని నిర్దేశించారని, అందులో ఇప్పటివరకు 8.15 లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. మిగిలిన లక్ష్యాన్ని ఛేదించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కాగా, యోగాపై ప్రజలకు అవగాహన కోసం ప్రతి రోజూ ఒక చోట యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా జూన్ 3వ తేదీన ఓర్వకల్ రాతివనం, జూన్ 12వ తేదీన కొండారెడ్డి బురుజు, 18వ తేదీన మంత్రాలయం రాఘవేంద్ర మఠంలో యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు.

కక్షపూరితంగానే అక్రమ కేసు

కర్నూలు(సెంట్రల్): రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఆటో మోటార్ వర్కర్ యూనియన్ సభ్యుడు వెంకటేశ్వర్లుపై అక్రమ కేసుపెట్టించారని మానవ హక్కుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఎంఏ దేంద్రబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాజీ శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తప్పుబట్టారు. రాయలసీమ ఆల్కలీస్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే కాలుష్యం వల్ల కర్నూలు నగరానికి ప్రమాదమని వివరిస్తూ వెంకటేశ్వర్లు కవిత రాయడంతో అతనిపై మంత్రి టీజీ భరత్ అండతో టీజీ వెంకటేష్ అక్రమ కేసు పెట్టించారన్నారు. తమ ఫ్యాక్టరీ వాచ్‌మెన్ వద్ద వెంకటేశ్వర్లు రూ.9 వేలు దొంగతనం చేసినట్లు అక్రమ కేసు పెట్టించగా, కర్నూలు మూడో పట్టణ పోలీసులు తమ విధులను అతిక్రమించి కేసు నమోదు చేశారని, పరిధి దాటి వ్యవహరించారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆల్కలీస్ ప్లాంటు విస్తరణపై మే 14వ తేదీన జరిగిన ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఇండోర్ స్విమ్మింగ్ పూల్‌ను వినియోగించుకోవాలి

కర్నూలు (టౌన్): పారిశ్రామిక వేత్త బీవీ రెడ్డి ఏర్పాటు చేసిన ఇండోర్ స్విమ్మింగ్ పూల్‌ను వినియోగించుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. ఆదివారం కల్లూరులోని మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిల్లలకు ఫ్రంట్, బ్యాక్ స్ట్రోక్, ఫ్రీస్టైల్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. వ్యాపార ధోరణి లేకుండా ఇండోర్ స్విమ్మింగ్ పూల్‌ను మహిళలు సైతం చక్కగా వినియోగించుకోవచ్చన్నారు. మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రాజశేఖర్ గౌడ్, విఠల్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. మూల విరాట్‌లకు జలాభిషేకం, సుప్రభాతసేవ, బండారార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, ఆకుల అలంకరణతో పాటు ప్రత్యేక పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మాళమల్లేశ్వరుడిని దర్శించుకోవడానికి ఆంధ్ర–కర్ణాటక నుంచి భక్తులు తరలి వచ్చారు.

ప్రారంభానికి నోచుకోని ప్రభుత్వ భవనాలు

- రూ. 84లక్షల ప్రజాధనం వృథా
- ఆర్‌బీకేను ప్రారంభించినా వినియోగించుకోని అధికారులు


నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని పాడుపు భవనం, ఆర్బీకే -2


పిల్లర్ల దశలోనే నిలిచిపోయిన హెల్త్ కేంద్రం పనులు


ఉలిందకొండలో ప్రారంభానికి నోచుకోని ఆర్బీకే - 1

కల్లూరు: జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలనను గ్రామ స్థాయికి తీసుకెళ్లింది. గ్రామ సచివాలయాల్లో 500కు పైగా ప్రభుత్వ సేవలు అందించింది. అలాగే రైతులకు కావాల్సిన ఎరువులు, పిచికారీ మందులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండేవి. ఇందులో భాగంగా ఉలిందకొండ గ్రామానికి రూ.84 లక్షలతో రెండు రైతు భరోసా కేంద్రాలు, పొదుపు భవనం, హెల్త్ కేంద్రం మంజూరు చేశారు. 2024లో వీటి నిర్మాణం పూర్తవగా ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభించలేదు. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక రైతు భరోసా కేంద్రం ప్రారంభించారు. అయితే అందులో ప్రభుత్వ పాలన కార్యక్రమాలు మాత్రం జరగడం లేదు. మరో రైతు భరోసా కేంద్రం, పొదుపు సంఘం భవనం మాత్రం ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. హెల్త్ కేంద్రం పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. లక్షలాది ప్రజాధనం వెచ్చించి నిర్మించిన భవనాలను కూటమి ప్రభుత్వం ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా మారాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా అధికారులు భవనాలను ఎందుకు వినియోగంలోకి తీసుకురావడం లేదని ప్రశ్నిస్తున్నారు. కొత్త భవనాలకు ఉన్న కిటికీలను కొందరు దుండగులు పగులగొట్టారు. ఇప్పటికీ రెండు రైతు భరోసా కేంద్రాలను పాత పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తుండటంతో అసౌకర్యాల నడుమ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలు, పొదుపు సంఘాల మహిళలు సమావేశమయ్యేందుకు పొదుపు భవనం నిర్మించింది. తర్వాత ఎన్నికల నియమావళి రావడంతో భవనాలను ప్రారంభించలేదు. ప్రస్తుతం రెండు రైతు భరోసా కేంద్రాలను పాత పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అందులో ఒకటి ప్రారంభించినా పరిపాలన కార్యక్రమాలు మాత్రం జరగడం లేదు. అధికారులు స్పందించి వెంటనే భవనాలను వినియోగంలోకి తీసుకురావాలి.

– నాగేష్, ఉలిందకొండ

సైన్స్ ప్రచార సారథులు మౌనం వీడాలి


మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): సైన్స్ ప్రచార రథ సారథులు మౌనం వీడాలని, శాస్త్రీయ విజ్ఞానం కలిగి చదువుకున్న వారు సైతం మౌనంగా ఉండటంతో అజ్ఞానులకు ఆయుధంగా మారిందని, ఇది సమాజానికి చెడు చేస్తుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్‌కుమార్ చెప్పారు. స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని వీబీఆర్ కాన్ఫరెన్స్ హాల్‌లో వేదిక కార్యకర్తల మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. ముగింపు సందర్భంగా బర్మా సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఉన్నత చదువులు చదువుకున్న విజ్ఞానవంతులు కూడా సోషల్ మీడియాలో పుంఖానుపుంఖాలుగా ప్రచారంలోకి వస్తున్న అశాస్త్రీయ అంశాలను నిజమా? కాదా? అని పరిశీలించడం లేదని, అత్యధికులు మౌనంగా ఉడటం ద్వారా అవే వాస్తవ అంశాలుగా ప్రచారంలోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సమాజానికి ఏ మాత్రం మంచి చేయదన్నారు. త్వరలో వైఎస్సార్ కడప జిల్లాలో జేవీవీ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామని, నూతన కమిటీ ఎంపిక, విధి విధానాలపై చర్చ జరిగిందని, ప్రజాస్వామ్య విధంగా ఓటింగ్ నిర్వహిస్తామని చెప్పారు. అన్ని జిల్లాల్లో జిల్లా మహాసభలను పూర్తి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వరాజ్యలక్ష్మి, కృష్ణాజీ, వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, రాష్ట్ర కమిటీ సభ్యులు సుజాత, మీన, శ్రీరాములు, వీరేష్, చక్రపాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి, ధనుంజయ్ పాల్గొన్నారు.

బాబు మోసం బట్టబయలు


మాట్లాడుతున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్

- రాష్ట్రంలో అరాచక పాలన
- ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు
- 4న వెన్నుపోటు దినం

కోడుమూరు రూరల్: సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు నాయుడు ఏడాది పాలనలో ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చలేదని.. సంక్షేమం పేరుతో ప్రజలకు బాబు చేస్తున్న మోసాలు బట్టబయలవుతున్నాయని కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ నిర్వహించ తలపెట్టిన ‘వెన్నుపోటు దినం’ పోరాట కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం కోడుమూరులో విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను దారుణంగా మోసం చేసిందన్నారు. ప్రశ్నిస్తే వారిపై తప్పులు కేసులు పెట్టి జైళ్లకు పంపుతోందన్నారు. కేవలం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని మాత్రమే రాష్ట్రంలో అమలు చేస్తోందని విమర్శించారు. కూటమి నాయకులు చేస్తున్న దౌర్జన్యాలను, దుర్మార్గాలను ప్రజలు గమనిస్తున్నారని, కూటమి నేతలు చేస్తున్న అరాచకాలపై ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. రానున్నది మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, కూటమి నాయకులు గుర్తించుకుని మెలగాలని హెచ్చరించారు. ప్రజల కోసం ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం రాజధాని పేరుతో వేలాది కోట్ల అప్పులను చేస్తూ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తోందని ఆరోపించారు.

అన్ని వర్గాలకు మొండిచేయి

జగనన్న ప్రవేశపెట్టిన వలంటరీ వ్యవస్థ, ఇంటింటికి బియ్యం పంపిణీ వాహనాలను రద్దు చేయడంతో పాటు, అనేక సంక్షేమ పథకాలను తుంగలో తొక్కి సీఎం చంద్రబాబు ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్నారన్నారు. రైతులకు రైతు భరోసా, చదువుకునే పిల్లలకు తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు, 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 అంటూ ఇలా ఎన్నో రకాల అబద్ధపు హామీలను ఇచ్చి వాటిని అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ గూడూరులో ‘వెన్నుపోటు దినం’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, మౌలాలి, ప్రసన్నకుమార్, గూడూరు మున్సిపల్ వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, లక్ష్మన్న, కర్నూలు వైస్ ఎంపీపీ నెహ మియ్యా, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, ఎర్రదొడ్డి సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, ఉప సర్పంచ్ మాదులు, మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాయర్ ప్రభాకర్, జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, శివరాముడు, అధికార ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు జ్యోతి, పార్టీ మండల అధ్యక్షులు రమేష్‌నాయుడు, మోహన్‌బాబు, నాయకులు పులకుర్తి సత్యారెడ్డి, రవికుమార్‌రెడ్డి, మల్లారెడ్డి, లింగమూర్తి, తేనేశ్వర రెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటేష్, మునెప్ప, సంపత్‌కుమార్, నరసింహారెడ్డి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీమఠం మేనేజర్‌గా శ్రీనివాసరావు


రాఘవేంద్రస్వామి సేవలో ఎస్కే శ్రీనివాసరావు

మంత్రాలయం : ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం మేనేజర్‌గా ఎస్కే శ్రీనివాసరావు మరోమారు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన వ్యక్తిగత సమస్యలతో మేనేజర్ పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేసిన విషయం విధితమే. ఆదివారం మేనేజర్‌గా మళ్లీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్రుల మూల బృందావనాలకు ప్రత్యేక పూజలు చేసుకున్నారు. మేనేజర్ చాంబర్ చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్–బి వెంకటేష్ జోషి, మేనేజర్–సి శ్రీపతి ఆచార్ ఆయనకు అభినందనలు తెలిపారు.

డీసీఎంఎస్ అభివృద్ధికి కృషి


డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నాగేశ్వరరావుయాదవ్

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ తెలిపారు. ఆయన ఆదివారం కొండారెడ్డి బురుజు సమీపంలోని డీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీసీఎంఎస్‌ను సమగ్రంగా అధ్యయనం చేయాల్సి ఉందని, ఎక్కడెక్కడ ఆస్తులు ఉన్నాయి.. ఆక్రమణలో ఉన్నాయా.. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సొసైటీ ప్రస్తుత పరిస్థితిపై ఆయన బిజినెస్ మేనేజర్ రాజేష్‌తో చర్చించారు. డీసీఎంఎస్‌ను అభివృద్ధి చేసి లాభాల బాట పట్టించేందుకు కృషి చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో డీసీఎంఎస్‌కు 18 బ్రాంచీలు ఉన్నాయని, వీటి ద్వారా ఎరువుల వ్యాపారంతో పాటు అన్ని పంట ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాయకులు సత్రం రామకృష్ణుడు, హనుమంతురావు చౌదరి, డీసీఎంఎస్ సిబ్బంది, బ్రాంచీ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ధూమపానంతో క్యాన్సర్ ముప్పు


డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్‌ను సన్మానిస్తున్న హార్ట్ ఫౌండేషన్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): ధూమపానం చేయడం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్, ఆంకాలజిస్టు డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్ క్లబ్‌లో లంగ్ క్యాన్సర్‌పై ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్ మాట్లాడుతూ ధూమపానం, కాలుష్య వాతావరణంలో ఎక్కువగా పనిచేయడం వంటి కారణాలతో ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తున్నాయన్నారు. ధూమపానం చేయడం వల్ల ఊపిరితిత్తుల్లో హానికారక రసాయనాలు చేరుకుంటాయని, అవి ఊపిరితిత్తులను క్రమంగా గట్టిగా మార్చి ఊపిరి ఆడకుండా చేసి దీర్ఘకాలంగా క్యాన్సర్‌గా మారుతాయన్నారు. ధూమపానంతో ఊపిరితిత్తుల సమస్యలతో పాటు గుండె, రక్తనాళాలు, కిడ్నీ, కాలేయం వంటి అవయవాలు దెబ్బతింటాయన్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ధూమపానం చేసే వారు భవిష్యత్‌లో వారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అనంతరం ఆయన్ను హార్ట్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ భవానీప్రసాద్, ట్రెజరర్ కేపీ రాముడు, సభ్యులు ఘనంగా సన్మానించారు.